ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య

మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

ఖిలావరంగల్, అక్టోబర్ 18: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన కమిషన్ సభ్యులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, లీలాదేవి, రాంబాబునాయక్, డీసీపీ రవీందర్‌తో కలిసి ల్యాండ్, సర్వీస్ అట్రాసిటీ కేసులపై సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న అభివృద్ధి ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఇప్పటి వరకు జిల్లాలో అభివృద్ధికి మంజూరైన నిధులు, వినియోగించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి, బాధ్యులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. విదేశీ విద్య పథకం, గురుకుల పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, తహసీల్దార్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కాట్రపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, అక్టోబర్ 18: రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి కోరారు. శుక్రవారం ఆమె కాట్రపల్లి, రాయపర్తిలోని రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆవరణల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే సన్నధాన్యం విక్రయించి రూ. 500 బోనస్ పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, డీఎంవో సురేఖ, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌నాయక్, డీసీవో నీరజ, ఇల్లంద మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, సొసైటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సీఈవో సోమిరెడ్డి, ఏవో వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కిష్టాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన యువకుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ – మిషన్ భగీరథ శాఖల ప్రత్యేక సమావేశానికి హాజరై ఉద్యోగులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

బాధితులకు తక్షణ సేవలు అందించాలి: సీపీ

పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ

వర్ధన్నపేట, అక్టోబర్ 18: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణ సేవలు అందేలా కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఇతర అధికారులతో కలిసి ఏసీపీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏసీపీ పరిధిలోని ఉన్న పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్ట్, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డులను పరిశీలించారు. తర్వాత వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో సీపీ సమీక్షించారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నర్సయ్య, వర్ధన్నపేట, పాలకుర్తి సీఐలు శ్రీనివాసరావు, మహేందర్ రెడ్డి, ఎస్సైలు రాసు, శ్రవణ్, సృజన్, చందర్, రాంచరణ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ డిప్యూటీ మేయర్ మృతి

రవీందర్(ఫైల్)

గిర్మాజీపేట, అక్టోబర్ 18: మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్(65) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు శివనగర్ కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలుపొందారు. రవీందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెరిక వాడలోని స్వగృహానికి రవీందర్ మృతదేహాన్ని తరలించగా, కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం, మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తదితరులు రవీందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: KARIMNAGAR
ARB.No. 35 of 2024
Between:-
M/s. Margadarsi Chit Fund Private Limited, Ramagundam. ...Disputant
AND
KATKURI LATHA @ RAJITHA DEVI & Others ...Opponents
NOTICE
To,
O-5. DEVULAPALLY RAVINDER, S/o. KRISHNA MURTHY, H.No. 3-117, Laxmipuram, Mdl: Duggondi, Warangal Rural.
O-6. KATKURI RAJITHA, W/o. K. MALLIKARJUN, H.No. 10-4-75, Girmajipet, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money. In the past you have been issued summon, but you have failed to receive the same. The above Dispute is posted on **22-11-2024** for your appearance. On that day you have to appear in person at 10:30 am before The Deputy Registrar referred above. Other-wise the case will be decided ex-parte.
Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**

ఇది పులిహోరా..!?

- కనిపించని పోపు దినుసులు
- మీ పిల్లలకు ఇలాగే వండి పెడుతున్నారా?
- కలెక్టర్ సత్య శారద ఆగ్రహం
- వంట మాస్టర్లను తొలగించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశం
- రెండు గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు

రాయపర్తి, అక్టోబర్ 18: పసుపు కలిపిన అన్నాన్నే విద్యార్థినులకు ఫలహారంగా (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తున్నారా... మీ ఇండ్లలో మీ పిల్లలకు ఇలాగే వండి పెడతారా.. అంటూ కలెక్టర్ సత్య శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని విద్యార్థులు, గురుకులాల సంక్షేమం, సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే.. గురుకులాల్లో పరిస్థితులు ఇంత దరిద్రంగా ఉన్నాయా అంటూ వాపోయారు. మండలకేంద్రం శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలను శుక్రవారం ఉదయం 7 గంటలకు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆమె నేరుగా వంటశాలలోకి వెళ్లారు. గురుకులంలోని సుమారు 800 మంది విద్యార్థినులకు అల్పాహారంగా ఈరోజు ఏం పెడుతున్నారని సిబ్బందిని కలెక్టర్ అడిగారు. పులిహోర తయారు చేశాం మేడమ్ అంటూ వారు సమాధానం చెప్పారు. వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న పులిహోరను చూసిన కలెక్టర్ ఒకింత షాక్‌కు గురయ్యారు.

కేజీబీవీలో ఫిర్యాదుల పెట్టెను పరిశీలిస్తున్న కలెక్టర్

బీన్ని పులిహోర అంటారా..?

పులిహోర తయారీలో కనీస పోపు దినుసులైన పల్లీలు, శనగలు, మినప పప్పు, ఎండు మిర్చి లేకుండా కేవలం బియ్యంలో పసుపు వేసి ఉడకబెట్టి పెడుతున్నారా అంటూ కలెక్టర్ కోపోద్రిక్తులయ్యారు. పులిహోరను తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్‌తో కలిసి చవిచూసిన ఆమె.. పులిహోరలో కనీసం ఉప్పు వేయడానికి కూడా మీ మనసు అంగీకరించడం లేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. వెంటనే గురుకులంలో ఇద్దరు వంట మాస్టర్లను విధుల్లో నుంచి తొలగించాలని, మరోసారి ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్య శారద హెచ్చరించారు. అనంతరం తరగతి గదులు, మినరల్ వాటర్ ప్లాంట్, క్రీడా మైదానాలు, డార్మెటరీ హాల్స్‌ను పరిశీలించారు. గురుకులంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వంటలపై ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులతో సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. అనంతరం ఫిర్యాదుల పెట్టెను కలెక్టర్ పరిశీలించారు. అందులో ఒక్క ఫిర్యాదు కూడా లేకపోడంతో ఆశ్చర్యపోయారు. గురుకులంలో నియంతృత్వం నడుస్తున్నదా అంటూ ప్రశ్నించారు. అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ సరితకు షోకాజ్ నోటీసులు జారీ చేయిస్తానని తెలిపారు.

రాయపర్తి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో పులిహోరను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

కేజీబీవీని సందర్శించిన కలెక్టర్

తిర్మలాయపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. తరగతి గదులు, భోజనశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ప్రత్యేకాధికారి బుర్ర కవిత, బోధన, బోధనేతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురుకులంలో పాముల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆవరణతోపాటు చుట్టుపక్కల ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

పత్తి పంట పరిశీలనలో బీఆర్ఎస్ నేతలు

నల్లబెల్లి, అక్టోబర్ 18: అతివృష్టితో పత్తి పంట బాగా దెబ్బతి దిగిబడి రాలేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. పార్టీ నాయకులు శుక్రవారం మూడుచెక్కలపల్లెలో పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 45 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట ఎర్రబారిపోయిందన్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో మూడో వంతు పంట దెబ్బతిన్నదన్నారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందన్నారు. దీంతో రైతులు పెట్టుబడి రాక అప్పుల ఊబిలోకి వెళ్లారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు బానోత్ పూల్‌సింగ్, ఊరటి అమరేందర్‌రెడ్డి, గూబ రాజు, సపావట్ దేవూ నాయక్, నాయకులు గాదం రాజ్‌కుమార్, బొమ్మిడి శివారెడ్డి, మంగీలాల్, భూక్యా బాలరాజు, మూడు సురేశ్, ఆర్‌వోఎఫ్ఆర్ చైర్మన్ బానోత్ శ్రీనునాయక్, బానోత్ బక్షానాయక్, సపవాట్ హుస్సేన్ పాల్గొన్నారు.

నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె, భూనాపురం మండలం వేపచెట్టుతండాలో పత్తి పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పత్తి రైతులకు ఆదుకోవాలి

ఖానాపురం: భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య కోరారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేపచెట్టుతండాలో దెబ్బతిన్న పత్తి పంటను వారు పరిశీలించారు. మండలవ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఒక్కో ఎకరానికి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి అయిందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చే దశలో పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 2 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. సర్వే చేసి ఎకరానికి రూ. 25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీ ప్రకాశ్‌రావు, మౌలానా, మాజీ సర్పంచ్‌లు కాస ప్రవీణ్‌కుమార్, భూక్యా పద్మావతి, గుగులోత్ పద్మ, వెంకన్న, అశోక్, బాలు, వేల్పుల లింగయ్య, పైండ్ల యాదగిరి పాల్గొన్నారు.

నర్సంపేట, వర్ధన్నపేటలో ఎంపీడీవోలకు వినతిపత్రాలు ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గ్రామ సభలోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 18: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన పార్టీ నేతలతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కమిటీలు ఏర్పాటు చేసి అర్హులకు అన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తోందని సత్యనారాయణ ధ్వజమెత్తారు. తక్షణమే ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామసభల ద్వారానే కమిటీలు వేయాలి

వర్ధన్నపేట: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేస్తున్న కమిటీలను గ్రామాలు, మున్సిపల్ పరిధిలో గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి డిమాండ్ చేశారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకరమణకు వినతిపత్రాలు అందజేశారు. కేవలం అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను మాత్రమే కమిటీల్లో సభ్యులుగా ఎంపిక చేసి వారికి నచ్చిన వారికే సహకారం అందించే అవకాశం ఉందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

'మా గ్రామాలను విలీనం చేయొద్దు'

నర్సంపేటరూరల్, అక్టోబర్ 18: నర్సంపేట మున్సిపాలిటీలో తమ గ్రామాలను విలీనం చేయొద్దని మహేశ్వరం, పర్శనాయక్‌తండా, నాగుర్లపల్లి వాసులు కోరారు. ఆయా గ్రామాల పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి మోతె పద్మనాభరెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం, పర్శనాయక్‌తండా, నాగుర్లపల్లి వందశాతం వ్యవసాయ ఆధారిత గ్రామాలేనని, కూలీల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. విలీనం వల్ల ఈజీఎస్ పథకం అందకుండా పోతుందన్నారు.

జీపీ స్వీపర్ మృతి

నెక్కొండ, అక్టోబర్ 18: నెక్కొండ జీపీలో 20 ఏళ్లుగా స్వీపర్‌గా పని చేస్తున్న ఈదునూరి జంపయ్య(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కార్యదర్శి సదానందం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎంజీఎంలో తనిఖీలు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 18: వరంగల్ ఎంజీఎం దవాఖానలో కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు గురువారం కార్మిక శాఖ అధికారులు ఎంజీఎంలో ఔట్‌సోర్సింగ్ సేవలు అందిస్తున్న కాంట్రాక్టు సంస్థ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనుమతి పత్రాలు, కాంట్రాక్టు లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడంతోపాటు సంస్థ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల వివరాలు, చెల్లిస్తున్న జీతభత్యాల రికార్డులతోపాటు ప్రభుత్వం కోరినంత సిబ్బంది పని చేస్తున్నది లేనిది పరిశీలించినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి తెలిపారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

కరీమాబాద్, అక్టోబర్ 18: రంగశాయిపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. అభ్యర్థులు పీజీలో 60 శాతం మార్కులతోపాటు ఉత్తీర్ణత, ఎన్ఈటీ/ఎస్ఎల్ఈటీ/పీహెచ్‌డీ ఏదైనా అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఫిజిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ పోస్టులకు ఈ నెల 19 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26న రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందన్నారు.

త్వరలోనే పంట పరిశీలన

ఖానాపురం, అక్టోబర్ 18: ధర్మారావుపేటలో కల్తీ విత్తనాలతో దెబ్బతిన్న పంటలను త్వరలోనే శాస్త్రవేత్తల బృందంతో పరిశీలిస్తామని ఏవో శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 11న పంటలను పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. సీడ్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఖానాపురం, అక్టోబర్ 18: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మిషన్ భగీరథ ఎస్ఈ సురేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులు, పంప్ ఆపరేటర్లు, మిషన్ భగీరథ సిబ్బందికి సింగిల్ ఫేస్, త్రీఫేస్ మోటర్ల నిర్వహణ, ఎలక్ట్రిక్ పరికరాల మరమ్మతులపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఎంజీఎంహెచ్‌లో చికిత్స పొందుతూ ఒకరి మృతి

సంగెం, అక్టోబర్ 18: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వీఆర్ఎన్‌తండాకు చెందిన బానోత్ బాలు(42) ఈ నెల 15న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలు శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సుకిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

కరీమాబాద్, అక్టోబర్ 18: జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను శుక్రవారం అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్ తేజ ఆధ్వర్యంలో ఉర్సు బైపాస్ రోడ్డులోని బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాలలో నిర్వహించారు. ఆరు అంశాల్లో విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వోకల్ మ్యూజిక్‌లో లోటస్ నేషనల్ పాఠశాల, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో జడ్పీహెచ్ఎస్ కొంకపాక, డ్యాన్స్‌లో అక్షర ఏకశిలా డీజీ పాఠశాల, ట్రెడీషనల్ స్టోరీ టెల్లింగ్‌లో జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి, విజువల్ ఆర్ట్స్ అంశంలో ఎంజేపీ ఖిలావరంగల్, థియేటర్ ఆర్ట్‌లో టీజీఆర్ఎస్ నెక్కొండ పాఠశాలలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, నాయకులు

హైదరాబాద్‌కు తరలిన గులాబీ శ్రేణులు

గిర్మాజీపేట, అక్టోబర్ 18: మంత్రి కొండా సురేఖపై పరువునష్టం దావా వేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరైన నేపథ్యంలో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మద్దతు తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన శివనగర్‌లోని తన ఇంటి నుంచి తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. తెలంగాణ భవన్ వద్ద నరేందర్ పార్టీ నేతలతో కలిసి జై కేసీఆర్, జై కేటీఆర్, జై తెలంగాణ నినాదాలు చేశారు.

వర్ధన్నపేటలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బకాయిలను విడుదల చేయాలి : ఏబీవీపీ

వర్ధన్నపేట, అక్టోబర్ 18: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం విద్యార్థులతో కలిసి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా, మండల బాధ్యులు జీవన్, శివమణి, అజయ్, ప్రశాంత్, కార్తీక్, సన్నీ పాల్గొన్నారు.

కోళ్ల ఫాంలపై పోలీసుల దాడులు

47 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సంగెం, అక్టోబర్ 18: సంగెం, గీసుగొండ మండలాల్లోని కోళ్ల ఫాంలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. సంగెం మండలం ఆశాలపల్లిలోని కిరణ్‌కుమార్ కోళ్లఫాం, గీసుగొండ మండలం మొగిలిచర్లలోని భద్రకాళి ఫ్రాల్ట్రీ ఫాంలో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలపల్లిలో 38.86 క్వింటాళ్లు, మొగిలిచర్లలో 8.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. గాడెపల్లికి చెందిన రాజు పారిపోయాడు. గాంధీనగర్‌కు చెందిన గాండ్ల శ్రీధర్‌ను పట్టుకున్నారు. ఈ బియ్యం విలువ రూ. 1,04,936 ఉంటుందని సీఐ శ్రీధర్ తెలిపారు.

జూనియర్ కాలేజీల్లో హాజరు శాతం పెంచాలి

పోచమ్మమైదాన్, అక్టోబర్ 18: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ధృవ ప్రైవేట్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సేవలు, కళాశాల టైం టేబుల్, ఫలితాలు, అటెండెన్స్, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాల మెరుగుదలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉందని, హాజరు పెంపు కోసం అధ్యాపకులు కృషి చేయాలన్నారు.

వలకు చిక్కిన కొండచిలువ

సంగెం, అక్టోబర్ 18: చేపల కోసం వేసిన వలకు కొండ చిలువ చిక్కిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. మొండ్రాయికి చెందిన మత్స్యకారుడు బయ్య సారంగం గురువారం సాయంత్రం ఎల్గూర్‌చెరువు చాతాళ్ల మడుగు వాగులో చేపల కోసం కచ్చు వల వేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా కొండచిలువ చిక్కింది. మరో వ్యక్తిని తీసుకెళ్లి వల నుంచి కొండచిలువను బయటకు తీశాడు. కానీ, అది అప్పటికే చనిపోయింది.

గుడుంబా రవాణాదారుల అరెస్ట్

నర్సంపేట రూరల్, అక్టోబర్ 18: ఇద్దరు గుడుంబా రవాణాదారులను ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నాగుర్లపల్లి శివారు నర్సంపేట–నల్లబెల్లి ప్రధాన రహదారిలో పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పర్శనాయక్‌తండాకు చెందిన బానోత్ రాజేంద్రప్రసాద్, బానోత్ సాంబయ్య బైక్‌లపై సారాను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, 11 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు న